క్లుప్తంగా

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



పలుకుదొడ్డిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ఈఓఆర్డీ సందీప్ పేర్కొన్నారు. మండలంలోని కంబదహాల్, గొల్లలదొడ్డి, పలుకుదొడ్డి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను చైతన్య పరచాలని ఈ సందర్భంగా ఈఓఆర్డీ సర్పంచ్‌లకు సూచించారు.

పాఠశాలల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండలంలోని ఎస్ కొత్తూరు, గగ్గటూరు, తమ్మరాజుపల్లె గ్రామాల్లోని పాఠశాలలను గురువారం ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన ఎంఈఓ విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన తీరుపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాహకులకు ఎంఈఓ సూచించారు.

కేసీకి నీటి విడుదల



గడివేముల సమీపంలో ఎస్‌ఆర్‌బీసీ కాలువలో నిండుగా ప్రవహిస్తున్న నీరు

గడివేముల: వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు గురువారం ఎస్‌ఆర్‌బీసీ, కేసీ కెనాల్‌కు సాగు నీరు రావడంతో ఊరట కలిగింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు కొన్ని రోజులుగా వర్షం లేక ఇబ్బందులకు గురైన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాడుపట్టిన మొక్కజొన్న, మిరప, పత్తి, సోయాబీన్ పైర్లకు మోటార్ల ద్వారా నీటిని పెట్టుకుంటున్నారు.


ప్రభుత్వ అనుమతి విత్తనాలే అమ్మాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ప్రభుత్వ అనుమతులున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మాత్రమే అమ్మాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లో పర్యటించారు. పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో అనుమతులు, నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, అనుమతులు లేని వస్తువులను అమ్మినట్‌లెయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు



మాట్లాడుతున్న గద్దల సామేల్

పాణ్యం: ఎస్సీ వర్గీకరణకు గురువారం సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల సామేల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. గద్దల సామేల్ మాట్లాడుతూ మందక్రిష్ణ మాదిగ చేపట్టిన ఏళ్లనాటి ఉద్యమాలకు ఫలితం తక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు బాబు, తిమ్మయ్య, నాగర్జున, తదితరులు పాల్గొన్నారు.

8న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 8వ తేదీన నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో జూనియర్స్ అండర్ –19 విభాగంలో బాల బాలికల జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సువర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 నుంచి 2009 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17, 18 తేదీల్లో కదిరి పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

బాబు ‘పింఛన్’ మాయాజాలం

- రెండురోజుల్లోపు పింఛన్ తీసుకోలేకపోతే ఇక లేనట్టే
- టీడీపీ ప్రభుత్వ నిర్ణయంపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- అమ్మో ఒకటో తారీఖు అనేలా ఉలిక్కిపడుతున్న అవ్వతాతలు
- ఇతర ప్రాంతాలకు వెళ్లిన వృద్ధులకు తప్పని పాట్లు



బ్రాహ్మణదొడ్డి సచివాలయం దగ్గర పింఛన్ ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

కోడుమూరు రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక పేరు...కూటమి ప్రభుత్వం అధికారం చేజిక్కుంచుకున్న వెంటనే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌గా మారిపోయింది...అంతేకాదు అమలు తీరు మారింది. రెండురోజుల్లోపు పింఛన్ తీసుకోలేకోవాలన్న టీడీపీ ప్రభుత్వ కఠిన నిర్ణయం పింఛన్ లబ్ధిదారులను భయపెడుతోంది. టీడీపీ ప్రభుత్వ పెద్దల తీరుతో మానవతా దృక్పథం అనే పదానికి అర్థం లేకుండా పోయింది. దీంతో అభాగ్యులైన పింఛన్‌దారులు ఇబ్బందులకు పడుతన్నారు. ఒకటో తారిఖు అంటే ఉలిక్కిపడుతున్నారు అవ్వతాతలు. జీవనోపాధి రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లిన కుమారులతోపాటు వారి పిల్లలను చూసేందుకు వెళ్లిన వృద్ధులైన తల్లిదండ్రులు స్వగ్రామాలకు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తుంది. ఎన్ని పనులున్నా మానుకుని పింఛన్‌దారులు ఇళ్ల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్లు పొందేందుకు లబ్ధిదారులకు ఐదు రోజుల గడువు ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం కేవలం రెండు రోజుల గడువు మాత్రమే ఇవ్వడంతో లబ్ధిదారులతోపాటు సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పింఛన్ సొమ్మునూ మిగుల్చుకునేందుకు ఇదో బాబు మాయజాలమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత జగనన్న ప్రభుత్వ తీరులా పింఛన్‌ను ఐదురోజులపాటు పంపిణీ చేయాలని కోరుతున్నారు పింఛన్ లబ్ధిదారులు.

కోడుమూరుకు చెందిన రంగమ్మకు 80ఏళ్లకు పైగానే ఉంటాయి...ఆరోగ్యం అంతంతమాత్రమే.. కళ్లు కూడా సరిగా కన్పించవు. దీంతో ఆమె ఒక్కతే ఇక్కడ ఉండలేక బతుకుతెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన కొడుకు వద్ద ఉంటూ కాలం వెళ్లదీస్తోంది. ఆమెకు కోడుమూరులో ఎన్‌టీఆర్ భరోసా కింద పింఛన్ వస్తుంది. అయితే ఆ పింఛన్ డబ్బులను నెలనెలా వచ్చి తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఎక్కడ ఒకటో తారిఖున రాకపోతే తన పింఛన్ డబ్బులందవనన్న బెంగతో భయపడుతూ వస్తోంది. ఈ పరిస్థితి రంగమ్మది మాత్రమే కాదు చాలామంది వృద్ధుల పరిస్థితి ఇదే..

పాపం పులకుర్తి లబ్ధిదారులు...

కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన వృద్ధులు అలింబీ, రామక్రిష్ణమ్మ, పార్వతమ్మ, వరమ్మ, వరలక్ష్మి, బోయ మునెమ్మ, నారాయణ, కురువ లక్ష్మి, సంజావతమ్మ, బోయ పెద్దయ్యలతో పాటు మరికొందరులు మే నెలాఖరులో తీర్థయాత్రలకు వెళ్లారు. వీరందరు సామాజిక పిఛన్ లబ్ధిదారులు. పింఛన్ల పంపిణీ విషయం తెలుసుకున్న హుటాహుటినా బయలుదేరినప్పటికీ చివరి రోజు సాయంత్రం అయ్యింది. మరసటి రోజు ఇస్తారులే అనుకున్న వీరికి నిరాశే మిగిలింది. వీరికి జూన్ నెలకు సంబధించిన పింఛన్ సొమ్ము అందలేదు. ఒక్కొక్కరికి రూ. 7 వేలు అందాల్సి ఉంది. ఆలస్యంగా రావడంతో వారందరికీ పింఛన్ సొమ్ము అందలేదు. సమస్యను మండల, జిల్లా అధికారులకు విన్నవించారు. ఆగస్టు మాసంలో మొత్తం పింఛన్ సొమ్ము అందుతుందని ఆశించిన వీరికి నిరాశే ఎదురైంది. ఇంత అన్యాయమా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మా పింఛన్ సొమ్మే మిగుల్చుకోవాలా అంటూ నిట్టూర్చుతున్నారు బాధిత పింఛన్ లబ్ధిదారులు. కోడుమూరు మండలంలో మొత్తం పింఛన్ లబ్ధిదారులు 9,106 ఉన్నారు. అయితే జూలై నెలలో 27 మందికి పింఛన్ సొమ్ము అందలేదు.

అవ్వతాతలకు తప్పని నిరీక్షణ

సి.బెళగల్: మండలంలో గురువారం పింఛన్ సొమ్ము తీసుకేందుకు లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పలేదు. అవ్వతాతలు సచివాయాల వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో ఉద్యోగులు ఆలస్యంగా రావడంతో లబ్ధిదారులు గ్రామ సచివాలయం చేరుకుని నిరీక్షించారు. చాలా గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్యలతో పింఛన్ సొమ్ము అందజేసేందుకు అధికారులు సైతం ఇబ్బందులు ఎదుర్కున్నారు. వేలు ముద్రలు, ఐరీస్ మ్యాచ్ కాకపోవడంతో మండల కేంద్రం సి.బెళగల్‌కు చెందిన వృద్ధురాలు సుంకేసుల గూడుబీకి పింఛన్ సొమ్ము అందలేదు. వృద్ధురాలిని కుటుంబ సభ్యులు ఆటోలో సచివాలయానికి తీసుకొచ్చి రియల్‌టైమ్ బెనిఫిషరీ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఆర్‌బీఐఎస్) లాగిన్ అయినా ప్రయోజనం చేకూరలేదు. అయితే శుక్రవారం గూడుబీ పేరు లాగిన్‌లోకి వస్తే పింఛన్ పంపిణీ చేస్తామని ఉద్యోగులు తెలిపారు. మండలంలో 97.53 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శకుంతల తెలిపారు.

సొంత సొమ్ములా పింఛన్ పంపిణీ

ఓర్వకల్లు: మండలంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ ఇష్టారాజ్యంగా చేపట్టారు. పింఛన్‌దారులను ఒకచోటికి పిలిపించి.. పింఛన్ సొమ్మును అందజేస్తున్నారు. ఓర్వకల్లులో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి లబ్ధిదారులను ఒకచోటికి పిలించి పింఛన్ సొమ్ము అందజేశారు. సాధారణంగా సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. పొలం పనులకు వెళ్లిన మహిళా కూలీలకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్‌ను సొంత సొమ్ములా పిలిపించుకుని అందజేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటింటికీ వచ్చి పింఛన్ సొమ్ము అందజేసిన విషయాన్ని ప్రజలు గుర్తు చేస్తున్నారు.

కల్లూరు తహసీల్దార్‌గా ఆంజనేయులు



తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ తహసీల్దార్

కల్లూరు: కల్లూరు తహసీల్దార్‌గా కె.ఆంజనేయులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లిన ఎమ్మిగనూరు తహసీల్దార్ కె. ఆంజనేయులును ఉన్నతాధికారులు కల్లూరుకు నియమించారు. కల్లూరులో సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తించిన తహసీల్దార్ మునివేలు సొంత జిల్లా అనంతపురానికి బదిలీ అయ్యారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ శివరామ్, ఆర్‌ఐ రాజేంద్రప్రసాద్, వీఆర్వోలు, సిబ్బంది తహసీల్దార్ మునివేలును ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. నూతన తహసీల్దార్‌గా నియమితులైన ఆంజనేయులకు సాధరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డి రవికిషోర్, మండల పరషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కమిటీ ఏర్పాటు

సి.బెళగల్: మండల స్థాయి పరిశుద్ధ్య కమిటీని జిల్లా అధికారులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శకుంతల తెలిపారు. ఈ మేరకు కమిటీ సభ్యులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమై మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను వారు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలలో పరిశుభ్రత సమస్యలను ఎప్పటికి అప్పుడు పరిష్కరించేందుకు జిల్లా ఉన్నతాధికారులు తనతోపాటు (ఎంపీడీఓ), తహసీల్దార్, ఈఓఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీహెచ్‌సీల డాక్టర్లతో మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామ స్థాయి పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్లతో గ్రామ కమిటీలను కూడా ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ క్రిష్ణమూర్తి, ఈఓఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, సి.బెళగల్, పోలకల్ పీహెచ్‌సీల డాక్టర్లు మిథున్‌కుమార్‌రెడ్డి, హరిచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ అందజేసిన ఎమ్మెల్యే



లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కోడుమూరు రూరల్ : ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా గురువారం గూడూరు మండలంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. అదేవిధంగా బూడిదపాడు, పెంచికలపాడు, కె.నాగలాపురం గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు క్రిష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా అందించే సామాజిక పింఛన్ పింపిణీ 95శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మి గురువారం తెలిపారు. మండలంలో 6,366మంది పింఛన్‌దారులు ఉండగా 6218 మందికి ఉద్యోగులు నగదు అందజేశారన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటిపై దాడికి యత్నం



పోలీసులతో మాట్లాడుతున్న బాధితుడు

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త దాసరి శ్రీనివాసులు ఇంటిపై గురువారం కొందరు టీడీపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాసరి శ్రీనివాసులు వివరాల మేరకు తాను జెడ్పీ హైస్కూల్‌లో కొన్నేళ్లుగా మధ్యాహ్నం భోజనం పథకాన్ని నిర్వహిస్తున్నాని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం తమపై దాడులకు దిగడం బాగాలేదన్నారు. టిడిపి కార్యకర్తలు తమ ఇంటి వద్దకు వచ్చి చంపుతామని బెదిరించారన్నారు. మహిళ అని చూడకుండా తన భార్య రమణమ్మను నానా దుర్భాషలాడారని ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజుల కిందట జెడ్పీ స్కూల్‌లో ఉన్న తమ బంకును గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారని, ఈ మేరకు ఫిర్యాదు చేసినా పోలీసులు ఇంతవరకు పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

డబ్బు కోసమే బంగారం వ్యాపారి కిడ్నాప్



కిడ్నాపర్ల అరెస్ట్‌ను చూపుతున్న కోడుమూరు సీఐ మన్సురుద్దీన్

కోడుమూరు రూరల్: గూడూరులో బంగారు వ్యాపారి డమామ్ వెంకటేష్‌ను కిడ్నాపర్లు కేవలం డబ్బు కోసం కిడ్నాప్ చేసినట్లు కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ వెల్లడించారు. బంగారు వ్యాపారిని కిడ్నాప్ చేసిన ఇద్దరు కిడ్నాపర్ల అరెస్ట్ వివరాలను గురువారం సాయంత్రం సీఐ మన్సురుద్దీన్ గూడూరు పీఎస్‌లో విలేకరులకు వివరించారు. వ్యాపారి డమామ్ వెంకటేష్‌ను పొన్నకల్ చెందిన బోయ కొండయ్య, పెద్దపాడుకు చెందిన గాండ్ల నరసింహులు మరో వ్యక్తితో కలిసి జూలై 29వతేదీ సాయంత్రం స్కార్పియో వాహనంలో గూడూరులో కిడ్నాప్ చేశారన్నారు. వీరి కోసం కోడుమూరు, గూడూరు, కె.నాగలాపురం, ఎమ్మిగనూర, కర్నూలు పోలీసులు బృందాలుగా ఏర్పడి సెల్‌ఫోన్ల సిగ్నల్స్ ఆధారంగా అదేరోజు అర్ధరాత్రి దాటిన తర్వాత ప్యాలకుర్తి, చనుగొండ్ల గ్రామాల మధ్య పొలాల రస్తాలో ట్రేస్ చేసి పట్టుకున్నారు. దీంతో నిందితులు వాహనాన్ని, కిడ్నాప్ చేసిన డమామ్ వెంకటేష్‌ను వదిలేసి పారిపోయారు. పరారీ ఉన్న కిడ్నాపర్ల పోలీసులు తీవ్ర గాలింపు నిర్వహించారన్నారు. ఈ మేరకు గురువారం నిందితులైన బోయ కొండయ్య, గాండ్ల నరసింహులును వర్కూరు గ్రామ సమీపంలో పట్టుకున్నట్లు సీఐ వెల్లడించారు. కాగా కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడైన మరో వ్యక్తి, వారికి సహకరించిన వ్యక్తుల కోసం ఇంకా గాలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో గూడూరు ఎస్‌ఐ హనుమంతప్ప పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గడివేముల: రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు కరిమద్దెల జిల్లా పరిషత్ ఉన్నపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శ్రీసత్యసాయి జిల్లాలోని ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 17న జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థిని మోహిని పాల్గొంటుందని వ్యాయామ ఉపాధ్యాయుడు బాల వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా సబ్ జూనియర్ విభాగంలో సాయిమణి పాల్గొంటుందని చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ మేరకు అవసరమైన ఖర్చులకు ఆర్థిక సాయం గ్రామ నాయకులు ఈశ్వర రెడ్డి, శివారెడ్డి అందించనున్నారు.

పరిశుభ్రత లోపిస్తే చర్యలు తప్పవు

- డీపీఓ నాగరాజు నాయుడు



గ్రామాల్లోని సమస్యలపై మండల అధికారులతో చర్చిస్తున్న డీపీఓ నాగరాజు నాయుడు

కోడుమూరు రూరల్ : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీఓ నాగరాజు నాయుడు ఆదేశించారు. గురువారం కోడుమూరులోని మండల పరిషత్ కార్యాలయాన్ని డీపీఓ సందర్శించారు. గ్రామాల్లోని పరిస్థితులపై ఎంపీడీఓ దివ్య, ఈఓఆర్డీ మంజుల, ఈఓ అజయ్ భాస్కర్‌లతో చర్చించారు. డీపీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడంతో పాటు, నీటిని క్లోరినేషన్ చేసిన తర్వాతనే కుళాయిలకు విడుదల చేయాలని సూచించారు. మండలంలో వ్యక్తిగత మరుగుదొడ్ల వివరాలను సాధ్యమైనంత త్వరగా సేకరించాలని డీపీఓ అధికారులకు సూచించారు.

తల్లిపాలు ఎంతో శ్రేష్టం





తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది, కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మంజుల

కోడుమూరు రూరల్: పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేష్టమని కోడుమూరు కోలోకేటెడ్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్ సూచించారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి తల్లి పుట్టిన వెంటనే బిడ్డ ముర్రుపాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమాభాయి, ఏఎన్‌ఎం శిరీషా, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు తాపించడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారిని డా. మంజుల తెలిపారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిడ్డ పుట్టిన ఆరు మాసాల వరకు ఎలాంటి బయటి ఆహారం ఇవ్వకూడదన్నారు.

చినుకు పడితే..చిత్తడే!



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా మురుగు నీటి గుంత

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఈ దారి చినుకుపడితే చిత్తడిగా మారుతుంది. ఆర్‌టీసీ బస్టాండ్ నుంచి గ్రామంలోకి వేళ్లె మార్గంలో మర్రిచెట్టు వరకు అక్కడక్కడ గుంతలు ఏర్పడి, వర్షపునీటితో దర్శనమిస్తుంది. వందల సంఖ్యలో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై మురుగునీరు నిల్వ చేరుతుంది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అంగన్‌వాడీ కేంద్రం వద్ద గుంతలో మురుగునీరు వంకను తలపిస్తుంది. దుర్గంధం మూలంగా అంగన్‌వాడీ పిల్లలు అస్వస్థకు గురయ్యే ప్రమాదం నెలకొంది. మర్రిచెట్టు సమీపంలో ఏర్పడిన గుంతలో మురుగునీరు చేరడంతో ప్రజలకు దోమల బెడద తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

పీఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

- 8న ఎన్నికలు... అదేరోజు ఫలితాలు.. కొత్త కార్యవర్గం ఏర్పాటు
- చేతులెత్తే పద్ధతిలో కమిటీ సభ్యుల ఎన్నిక
- విద్యాశాఖ అధికారుల ఏర్పాట్లు
- 38 పాఠశాలలో జరగనున్న పీఎంసీ ఎన్నికలు



ఆళ్లగడ్డ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

గడివేముల: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి ఎన్నికలను పాఠశాలల నుంచి నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల అభివద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు ఏర్పాటు చేసిన పేరెంట్ మానిటరింగ్ కమిటీ(పీఎంసీ) ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసింది. 8వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల తల్లిదండ్రులు చేతులెత్తే పద్ధతిలో పీఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. దీంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలను జరిపించేందుకు విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

గడివేముల మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఏపీ రెసి డెన్షియల్, కేజీబీవీ సర్కారు బడులు ఉన్నాయి. వాటిలో 5,720 మంది విద్యార్థులు ఈ ఏడాది చదువుతున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్లు లిస్టు (తల్లిదం డ్రుల) జాబితా ప్రచురణ చేశారు. 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట లోపు ఓటర్లు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, అదే రోజు మధ్యాహ్నం 3–4 గంటల మధ్యలో తుది ఓటర్ల జాబితా ప్రచురణ చేస్తారు. రాజకీయ జోక్యం లేకుండా ఆగస్టు 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలో లోపు పీఎంసీ ఎన్నికలను నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల మధ్య తొలి సమావేశం నిర్వహించనున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తాం



పీఎంసీ ఎన్నికలకు సంబంధించి ఈ రోజున నోటిఫికేషన్ విడుదల చేయండం జరిగింది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 38 పాఠశాలలో జరుగుతున్న పీఎంసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరి సహకారం ఉండేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తాం.

– విమలా వసుంధర దేవి, ఎంఈఓ–2,గడివేముల

ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్నికలు

పాణ్యం: ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎంసీ (స్కూల్ మెనేజ్‌మెంట్ కమిటీ)ఎన్నికల షెడ్యూల్డ్ ప్రకటించడంతో గురువార అధికారులు నోటిఫికేషన్‌ను ఆయా పాఠశాలలో అతికించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈనెల 8వ తేదిన చెర్మన్, వైస్ చెర్మన్‌ల ఎన్నిక ఉంటుందన్నారు. ఎన్నికైన సభ్యులు చెర్మన్, వైస్ చెర్మన్‌లను ఎన్నుకుంటారన్నారు. మండలంలో మొత్తం 46పాఠశాలలకుగాను 4,838మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు 8వ తేదీన తప్పక పాఠశాలకు రావాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

సి.బెళగల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల నిర్వహణ కమిటీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ – ఎస్ఎంసీ) ఎన్నికకు గురువారం నోటీఫికేషన్ జారీ అయ్యింది. మండల కేంద్రం సి.బెళగల్‌లోని రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కిషోర్‌కుమార్ టీచర్లతో కలిసి పాఠశాల నోటీస్ బోర్డులో ఎస్ఎంసీ నోటీఫికేషన్ ప్రదర్శించారు.

రగ్బీ అంతర్ పాఠశాలల పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 8వ తేదీ నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా స్థాయి (కర్నూలు, నంద్యాల) రగ్బీ అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–15 విభాగంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2009 – 2012 మధ్య జన్మించిన వారు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. విజేతలకు కప్పుతో పాటు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పాల్గొనే క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు కూడా ఇస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్): ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించనున్న 11వ రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట పోటీల్లో పాల్గొనే జట్టును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు ఉత్తమంగా రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం ఆ సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్ ఎంపికైన జట్టు వివరాలు ప్రకటించారు.